# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య సంబంధాలను ప్రవాస భారతీయులు బలోపేతం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ మస్కట్‌లో ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ బిన్ హమద్ అల్ బుసైదీతో సమావేశమై వివిధ అంశాలపై చర్చలు జరిపారు.
- ❖ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలలో ఒకటని కేంద్రమంత్రి జే. పీ. నడ్డా అన్నారు.
- ❖ వెనిజులాలో ఇటీవల సంభవించిన భూకంపాల నేపథ్యంలో భారత్ అందించిన సహాయానికి ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ధన్యవాదాలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - న్యూజిలాండ్ దేశాల మధ్య సంబంధాలను ప్రవాస భారతీయులు బలోపేతం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు ఆక్లాండ్ చేరుకున్నారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ విమానాశ్రయంలో మోదీకి ఘన స్వాగతం పలికారు. ఈ సాయంత్రం ఆక్లాండ్‌లో జరిగిన స్వాగత కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ.. భారతదేశపు సాంస్కృతిక వారసత్వపు వేడుకలను వీక్షించారు. ఇవి పంజాబ్, తమిళనాడు సంస్కృతులను, కర్ణాటక, హిందుస్థానీ శాస్త్రీయ సంగీత సమ్మేళనాన్ని, అలాగే.. వందేమాతరం గీతాన్ని ప్రదర్శించాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. ప్రజలను ఏకం చేసే విశిష్ట శక్తి సంగీతానికి ఉందని, నేటి ప్రదర్శన భారత్ - న్యూజిలాండ్ స్నేహంలోని ఆత్మీయతను, గాఢతను ప్రతిబింబించిందన్నారు. కాగా.. ఈ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత, ప్రజల మధ్య సంబంధాలలో సహకారాన్ని బలోపేతం చేసే మార్గాలపై ఇద్దరు నాయకులు చర్చించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ బిన్ హమద్ అల్ బుసైదీతో మస్కట్‌లో ఈరోజు సమావేశమై.. ఇరు దేశాల మధ్య సహకారానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, అనుసంధానం, సముద్రయానం, సాంకేతికత, రక్షణ, సైబర్, ఏఐ రంగాలపై ప్రధానంగా చర్చలు జరిగాయని జైశంకర్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. గల్ఫ్‌లోని తాజా పరిణామాలు, ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే ప్రయత్నాలపై కూడా ఇరువురు నాయకులు పరస్పరం అభిప్రాయాలను తెలియజేసుకున్నారు. ఈ చర్చలు భారత్, ఒమన్‌ల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యంలోని విశ్వాసాన్ని, బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని జైశంకర్ ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ABDM)లో 94 కోట్ల ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతా నంబర్లు నమోదు చేయబడ్డాయని, 105 కోట్ల ఆరోగ్య రికార్డులు అనుసంధానం జరిగిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జే పీ నడ్డా తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ABDM మిషన్ స్టీరింగ్ గ్రూప్ 3వ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ మిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య వ్యవస్థలలో ఒకటిగా నిలిచిందన్నారు. ABDM కింద ఒక పటిష్టమైన డిజిటల్ ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ.. దేశవ్యాప్తంగా దీని వినియోగాన్ని గరిష్ఠ స్థాయికి పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణ వెసులుబాటు సాధించడానికి సాంకేతికత ఒక శక్తివంతమైన సాధనంగా కొనసాగాలని కేంద్రమంత్రి సూచించారు. కాగా.. డిజిటల్ ఆరోగ్య వినియోగాన్ని విస్తృతం చేయడం, కృత్రిమ మేధ (ఏఐ) తో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఉపయోగించుకోవడం, సంస్థాగత సామర్థ్యాలను బలోపేతం చేయడం మొదలైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వెనిజులాలో ఇటీవల సంభవించిన భూకంపాల నేపథ్యంలో భారత ప్రభుత్వం `ఆపరేషన్ అమిస్టాడ్` పేరిట ప్రారంభించిన సహాయ, విపత్తు ప్రతిస్పందన మిషన్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా భారత్ సకాలంలో అందించిన సహాయం, మద్దతు, సంఘీభావానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 26వ తేదీన వైమానిక దళానికి చెందిన రెండు సి-17 గ్లోబ్ మాస్టర్ III విమానాలు, పారా ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్‌కు చెందిన 41 మంది సభ్యుల బృందాన్ని వెనిజులాకు తీసుకువెళ్లాయని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ విద్యుత్ డిమాండ్‌లో 50 శాతానికి పైగా స్వచ్ఛ ఇంధనం ద్వారా తీర్చడం రెండవ సారి జరిగిందని నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. ఈ నెల 6వ తేదీన విద్యుత్ సరఫరాలో పునరుత్పాదక వనరుల వాటా 50.2 శాతంగా నమోదైందని ఆయన సామాజిక మాధ్యమ పోస్ట్‌లో ఈరోజు వెల్లడించారు. భారతదేశ స్వచ్ఛ ఇంధన వ్యవస్థ బలోపేతం అవుతోందని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం దృఢ సంకల్పంతో వేగంగా సుస్థిర వృద్ధిని కొనసాగిస్తోందని కేంద్రమంత్రి తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అధిక ఆల్కహాల్‌ను కలిగి ఉన్న ఔషధ ఫార్ములేషన్‌ల నియంత్రణను పటిష్టం చేసే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 1945 నాటి ఔషధ నిబంధనలను సవరించింది. ఈ మేరకు.. ఇథైల్ ఆల్కహాల్‌ను కలిగి ఉన్న ఫార్ములేషన్‌లకు లైసెన్సింగ్ అవసరాల నుండి ప్రస్తుతం ఉన్న మినహాయింపును కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ

తొలగించింది. 30 మిల్లీలీటర్ల కంటే అధిక పరిమాణంలో, ప్రతి ఘన పరిమాణానికి 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్‌ను కలిగి ఉన్న అన్ని ఫార్ములేషన్లు ఇకపై షెడ్యూల్ K కింద వాటికి అందించిన మినహాయింపు పరిధిలోకి రావని, అటువంటి ఉత్పత్తులు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్- 1940 కింద అవసరమైన లైసెన్సులను పొందవలసి ఉంటుందని మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ జోరమ్ అనియా.. యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే బృందంతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. బాలల కేంద్రీకృత అభివృద్ధి, పాఠశాల విద్య, మానవ అభివృద్ధి రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఈ సమావేశంలో ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకులలో సురక్షితమైన, సమ్మిళిత అభ్యసనం, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ఉపాధ్యాయ విద్య, విద్యార్థుల సంక్షేమం, సైబర్ భద్రత, డిజిటల్ భద్రత వంటి అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమం, విద్యా ఫలితాలను మెరుగుపరచడంలో సాక్ష్యాధారిత విధాన రూపకల్పన, సామాజిక భాగస్వామ్యం, విపత్తులను తట్టుకునే సామర్థ్యం, మహిళా స్వయం సహాయక బృందాల పాత్రల ఆవశ్యకతను డాక్టర్ జోరమ్ అనియా వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లా గత సంవత్సర కాలంలో సుమారు 2 లక్షల 85 వేల నీటి సంరక్షణ, ఇంకుడుగుంతల నిర్మాణాలను ఏర్పాటు చేసిందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తెలిపింది. “క్యాచ్ ది రెయిన్” ఉద్యమ వేగాన్ని కొనసాగించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్” కార్యక్రమంలో ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ.. “జల్ సంచయ్ జన భాగీదారీ-2.0” కింద సామూహిక నీటి సంరక్షణకు ఇది ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని పేర్కొంది. గ్రామ పంచాయతీలు, స్థానిక సంఘాలు, జిల్లా యంత్రాంగం భాగస్వామ్యంతో బలోద్ జిల్లా విస్తృత శ్రేణిలో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల సంరక్షణ కార్యక్రమాలను అమలు చేసింది. జల్ సంచయ్.. జన భాగీదారీ 1.0 కింద.. ఈ జిల్లా లక్షకు పైగా నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసి, జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని, తూర్పు జోన్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పచ్చదనాన్ని విస్తరించేందుకు ఢిల్లీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ, సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ఒక కీలక ముందడుగని కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు లేఖరాస్తూ.. 70 లక్షలకు పైగా వాతావరణ మార్పులను తట్టుకోగల చెట్లను నాటాలనే ప్రతిపాదనను, 70కి పైగా జలాశయాల అభివృద్ధిని, దాదాపు 6 వేల హెక్టార్ల భూమిని అటవీ ప్రాంతంగా నోటిఫై చేయడాన్ని ప్రశంసించారు. ఈ చర్యలు ఢిల్లీ పర్యావరణ భద్రతను బలోపేతం చేయడంతో పాటు పట్టణ గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ప్రతిపాదిత 8 అడవులలో కనీసం 20 శాతం వాటాను ఔషధ మొక్కల జాతులకు కేటాయించాలని, లేదా ప్రత్యామ్నాయంగా కనీసం రెండు అడవులను ప్రత్యేక ఔషధ మొక్కల అడవులుగా అభివృద్ధి చేయాలని ప్రతాప్‌రావు జాదవ్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల దుర్వినియోగంపై నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఈ నెల 13వ తేదీన విచారించనుంది. రామ మందిరానికి అందిన విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో... ఆలయ ట్రస్ట్ అభ్యర్థన మేరకు గత నెల 13న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం SIT ను ఏర్పాటు చేసింది. కాగా.. విరాళాల చోరీ ఆరోపణలకు సంబంధించి అరెస్టు అయిన 8 మంది నిందితుల్లో ముగ్గురికి ఈ నెల 7వ తేదీన అయోధ్య కోర్టు ఒక రోజు పోలీసు రిమాండ్ మంజూరు చేసింది. గత నెల 29న స్థానిక కోర్టు ఆ 8 మంది నిందితులను 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =